క్లుప్తంగా

జగనన్న సురక్షతో మెరుగైన వైద్య సేవలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చిత్తూరు మేయర్ అముద అన్నారు. సోమవారం 39వ డివిజన్‌లోని పెద్ద హరిజనవాడలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆమె పరిశీలించారు. ప్రజల వద్దకే వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని వైద్య సేవలు అందించడానికి జరుగుతున్న సర్వేలో ప్రజలు పాల్గొనాలని సూచించారు.

28న గుర్రం జాషువా జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 28 న గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలమనేరులోని కళామందిరంలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శతావధాని ఆముదాల మురళి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జాషువా స్మారక పురస్కారాలు అందించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యాదమరి: మండల కేంద్రంలోని యాదమరి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. చెన్నై ఎంఎన్ ఆస్పత్రి వైద్యులు 74 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 28 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. నిర్వాహకులు పెరియంబాడి నాగరాజు పర్యవేక్షించారు.

కాటన్ బ్యాగులు పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: పండిట్ దీనదయాళ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం చర్చివీధిలో బీజేపీ నాయకులు వెయ్యి కాటన్ బ్యాగులు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు షణ్ముగం, శివనారాయణ, జగదీశ్వరనాయుడు, చిట్టిబాబు, శ్రీనివాసులు, రామభద్ర, గోకుల్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఫ్యాప్టో నేతలు

చిత్తూరు కలెక్టరేట్: సీపీఎస్‌ను రద్దు చేయాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మునాఫ్ డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జీపీఎస్ విధానంపై ప్రభుత్వం మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తే లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసినట్లవుతుందన్నారు. నాయకులు గంటామోహన్, దేవరాజులురెడ్డి, చెంగలరాయమండడి, జీవీ రమణ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



ఆకాష్‌ను అభినందిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్: జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌కు చిత్తూరు పీసీఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఆకాష్ ఎంపికయ్యాడు. సోమవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్ జరిగింది. చిరుధాన్యాలు ఒక మంచి పోషకాహారం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆకాష్ పాల్గొన్నారు. ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. త్వరలో జాతీయ స్థాయిలో ఢిల్లీలో నిర్వహించే సెమినార్‌లో పాల్గొంటాడని విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థిని ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, జిల్లా సైన్స్ అధికారి వెంకటరమణ అభినందించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యాదమరి: జిల్లా స్థాయి వాలీబాల్ జట్లను సోమవారం యాదమరి ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. నియోజకవర్గ స్థాయిలో స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 కేటగిరీల్లో వాలీబాల్ పోటీలను పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ ప్రారంభించారు. ఐదు మండలాల నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన జట్లను ఎంపిక చేశారు. వీరు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. పీడీ రవి, హరికృష్ణ, దాము పర్యవేక్షణలో నిర్వహించారు.



రథంపై విహరిస్తున్న స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



నాట్యం చేస్తున్న కళాకారిణి



ఉత్సవమూర్తికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు

సాంస్కృతిక వైభవం

- రథోత్సవంలో భక్తిభావాన్ని చాటిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న నాటికలు, హరికథా గానాలు
- ప్రత్యేక ఆకర్షణగా చాక్‌లెట్, వేరుశనగ గింజలతో చేసిన గణనాథులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథోత్సవం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తిభావాన్ని చాటారు. కీలుగుర్రాలు, వృషబాలు, కొలాటాలు, డప్పు వాయిద్యాలు, నయాండీ, లంబాడీ, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. అలాగే స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా గానాలు భక్తులను విశేషంగా అలరించాయి. రథోత్సవం పూర్తి కాగానే ఉత్సవమూర్తులను ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు ఊరేగింపుగా తీసుకెళ్లి కల్యాణ వేదికలో కొలువుదీర్చి భక్తులకు దర్శనం కల్పించారు.

కాణిపాకం.. పుష్పశోభితం

ఆలయం మొత్తం విదేశీ పుష్పాల అలంకరణతో శోభాయమానంగా మారింది. రథోత్సవం సందర్భంగా ఆలయ అన్వేటీ మండపంలో చాక్‌లెట్లు, వేరుశనగ గింజలతో వినాయక ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

విరివిగా అన్నదాన కార్యక్రమాలు

వినాయకస్వామి రథోత్సవానికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో స్థానికులు, దాతలు ఆలయ పరిసరాల్లో అన్నదానం చేశారు. ఆలయ అన్నదాన సత్రంలో నిరంతరాయంగా అన్నదానం చేస్తున్నారు. ఆలయ చైర్మన్, ఈఓ, సర్పంచ్ శాంతిసాగర్ రెడి, ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.



చాక్‌లెట్‌లతో వినాయకుడి ప్రతిమ



ప్రశంసాపత్రాలు అందుకున్న కళాకారులతో ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు



విదేశీ పుష్పాలు, అరటి పిలకల అలంకరణలో కళకళలాడుతున్న ఆలయం



వేరుశనగ గింజలతో ఏకదంతుడు









దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు, లంబాడీల నృత్యాలు, రథం ముందు పిండి దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు, విదేశీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా ఉన్న సుపథ మండపం

స్పందన వినతులకు సత్వర పరిష్కారం



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే స్పందన వినతులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి త్వరితగిన పరిష్కరించాలని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిపాలన, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. వీటిపై అధికారులతో చర్చించిన కమిషనరన్.. పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయ కమిషనర్ గోవర్ధన్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ తదితరులు ఉన్నారు.

తపాలా చట్టంపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు కార్పొరేషన్: తపాలా చట్టంపై అధికారులు, సిబ్బందికి అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్ తెలిపారు. ప్రధాన తపాలా కార్యాలయంలో సోమవారం తపాలా ఇన్‌స్పెక్టర్లు, పోస్టుమాస్టర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. తపాలా 1898 యాక్ట్‌పై అవగాహన పలువురికి లేదని చెప్పారు. పేదలకు అందించాల్సిన సేవలపై మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ప్రధాన సమాచార సాధనమైన తపాలాశాఖపై ప్రజలు విశ్వాసంగా ఉన్నారని చెప్పారు. పల్లెలకు సేవలు అందిస్తున్న విస్తృతమైన నెట్‌వర్క్ ఉందన్నారు. ప్రతి గ్రామానికీ వెళ్లి వారికి ఉత్తరాలను ఇస్తుంటారని గుర్తుచేశారు. మండల, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా పేదలకు న్యాయసేవలు అందిస్తోందని వివరించారు. వీటి ద్వారా కక్షిదారులు కేసులను వాదిస్తామన్నారు. కార్యక్రమంలో తపాలా అధికారులు లక్ష్మన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు మద్యం సీజ్.. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: తమిళనాడు నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచిన చిట్టిబాబు (37)ను చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. చిత్తూరు–యాదమరి రోడ్డులోని తుమ్మిందపాళ్యం క్రాస్ వద్ద ఎస్‌ఈబీ పోలీసులు తనిఖీలు చేపట్టగా చిట్టిబాబు వద్ద ఓ సంచిలో 50 మద్యం బాటిళ్లను గుర్తించి, అతడ్ని అరెస్టు చేశారు. నిందితుడ్ని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరులోని జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు. ఈ దాడుల్లో ఇంటిలిజెన్స్ ఎస్‌ఐ రాంప్రసాద్, సిబ్బంది సుబ్రమణ్యం, రేఖ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక దినోత్సవానికి ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరులో ఈ నెల 27వ తేదీ ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి రూపేంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు నగరంలోని గాంధీ సర్కిల్ నుంచి అంబేడ్కర్ భవనం వరకు 2కే రన్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

వినాయకుడి లడ్డూ రూ.18 వేలు



లడ్డూ దక్కించుకున్న భక్తుడితో యువకులు

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఉభయదారులు తయారు చేసిన 9 కిలోల లడ్డూను వినాయక స్వామికి సమర్పించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. కార్తీక్ అనే భక్తుడు రూ.18,500లకు దక్కించుకున్నాడు. అనంతరం స్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

గ్రాప్లింగ్ పోటీల్లో స్వర్ణం

యాదమరి: విశాఖపట్నంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో యాదమరికి చెందిన యువశ్రీ గోల్డ్‌మెడల్ సాధించింది. అలాగే దీపా కాంస్య పతకం కైవసం చేసుకుంది. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

గంగమ్మ ఒడిలోకి గణేశుడు

- కోలాహలంగా డీఐ రోడ్డు వినాయకుడి నిమజ్జనం
- పాల్గొన్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి
- లడ్డూ వేలంలో రూ. 3 లక్షలు

చిత్తూరు రూరల్: నగరంలోని డీఐ రోడ్డులో కొలువుదీరిన ఏకదంతుడి నిమజ్జనోత్సవం సోమవారం కోలాహలంగా జరిగింది. ఈసారి 7 భారీ విగ్రహాలను ప్రతిష్టించారు. 8వ రోజు ఊరేగింపు కోసం ఒక్కో విగ్రహానికి ఒక్కో వాహన సేవను తీసుకొచ్చారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్వామికి సారెను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆయనకు నిర్వాహకులు కన్నన్ స్వాగతం పలికారు. తర్వాత విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ప్రారంభమైంది. ఊరేగింపుగా వస్తున్న స్వామికి భక్తులు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. జై..జై గణేశా..అంటూ నినాదాలు చేశారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల డప్పు వాయిద్యాలకు యువత నృత్యం చేస్తూ సందడి చేశారు. జనసందోహం నడుమ నిమజ్జనం చేశారు.

ఊరేగింపు ఇలా..

డీఐ రోడ్డులో ఉదయం 11 గంటలకు శోభాయాత్ర ప్రారంభమైంది. బజారువీధి మీదుగా ఎంఎస్ఆర్ సర్కిల్, హైరోడ్డు మీదుగా కట్టమంచి వరకు ఊరేగింపు కొనసాగింది. 2 గంటలకు కట్టమంచి చెరువులో క్రేన్ సాయంతో వినాయకులను నిమజ్జనం చేశారు.

పోటాపోటీగా లడ్డూ వేలం

లడ్డూ వేలం పోటాపోటీగా సాగింది. రూ. లక్షతో ప్రారంభమై రూ.3 లక్షలకు పలికింది. తేనెబండకు చెందిన జగ్గ అనే భక్తుడు దక్కించుకున్నాడు. విజయానందరెడ్డి చేతుల మీదుగా అందించారు. డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.





జలధికి సిద్ధమైన గణనాథులు, వినాయకుడి శోభాయాత్రలో పాల్గొన్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

రైతు సంఘాలు బలోపేతం కావాలి



రైతు ఉత్పత్తిదారుల మండల నూతన కమిటీ

- జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: రైతులు సంఘాలుగా ఏర్పడి అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మండల వ్యవసాయదారుల ఉత్పత్తి సంఘం సమావేశాన్ని ఏపీఎం మీరాబాయి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. గ్రామాల్లో రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే రాయితీలు, పంట రుణాలు, వ్యవసాయ పరికరాలను అందుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతాంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు, మందులు, ఎరువులను అందిస్తోందని తెలిపారు.

మండల నూతన కార్యవర్గం

రైతు ఉత్పత్తిదారుల సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమేష్ (ఈచనేరిపల్లె), ఉపాధ్యక్షుడుగా ప్రభాకర్‌రెడ్డి(మొగిలిమిట్టూరు), కార్యదర్శిగా గణపతి(బొమ్మాయిపల్లె), ఉపకార్యదర్శిగా గీత(పాలమాకుల పల్లె), కోశాధికారిగా సుమత్‌రెడ్డి(సదకుప్పం), సభ్యులుగా జీవరత్నంనాయుడు, భక్తవత్సలరెడ్డి, సుబ్రమణ్యం, డిల్లీబాబు, గుణశేఖర్‌రెడ్డి, రమణమ్మ, స్వప్న, దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోఆప్షన్ సభ్యుడు ఫిరోజ్‌అహ్మద్, సుధాకర్‌రెడ్డి, జయమ్మ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పురోగతిపై సమీక్ష



హెచ్‌ఎంలకు సూచనలు ఇస్తున్న డీవైఈఓ

బంగారుపాళెం: పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులు వేగవంతం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని చిత్తూరు ఉప విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం సాయంత్రం మండలంలోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నాడు–నేడు పథకం కింద పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరాతీశారు. అకడమిక్, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, విద్యాసంవత్సరంలో విద్యార్థుల అడ్మిషన్లు, సీఆర్‌సీ హెచ్‌ఎంల బాధ్యతలు, నైట్ వాచ్‌మెన్ల విధులపై చర్చించారు. పేద విద్యార్థులు చదువుతున్న పాఠశాలలను ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా ఆధునీకరించి వారికి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోందన్నారు. దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. మంగళవారం నుంచి జరగనున్న సీఆర్‌సీ సమావేశాలను పటిష్టంగా జరపాలని ఆదేశించారు. సమావేశంలో ఎంఈఓ–1 నాగేశ్వర్‌రావు, ఎంఈఓ–2 రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

బంగారుపాళెం: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాభావాలను అలవాటు చేసుకోవాలని ప్రిన్సిపల్ గిరిబాబు సూచించారు. బంగారుపాళెం పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పిచ్చిమొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఆదర్శవంత సమాజ స్థాపన కోసం యువత సామాజిక సేవను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మురళి పాల్గొన్నారు.